క్లుప్తంగా

పొదుపు సంఘం సభ్యులకు పాస్ బుక్‌ల పంపిణీ



పాస్ బుక్‌లు పంపిణీ చేస్తున్న ఏపీఎం

తలకొండపల్లి: పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లిలో ఏపీఎం శ్రీదేవి, సంఘం సభ్యులు.. సభ్యత్వం లేని వారిని కలిశారు. సంఘం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. నేటి నుంచి డిసెంబర్ 9 వరకు చేరిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా సంఘంలో చేరిన మహిళలకు వ్యక్తిగత పాస్ బుక్‌లు పంపిణీ చేశారు. నెలనెలా క్రమం తప్పకుండా పొదుపు డబ్బులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు దీపా, రాములు, విజయలక్ష్మి, సత్యం, లక్ష్మయ్య, ఎంఎంఎస్ అధ్యక్షురాళ్లు మల్లమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కమిషనర్ వసంత, ఎంపీడీఓ మాధురి



చెరువులో చేపపిల్లలను వదులుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆమనగల్లు: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని కమిషనర్ వసంత, ఎంపీడీఓ కుసుమమాధురిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సురసముద్రం చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యతో కలిసి చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మక్తాల వెంకటయ్య, నాయకులు ఎర్రవోలు మహేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య సన్నిధిలో అభిషేక్‌రెడ్డి



అభిషేక్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధి పోచారంలో కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి స్వామివారిని దర్శించుకోగా.. ఆయనను గౌడనేతలు సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, దాసు, వెంకటేశ్, చిన్న, గౌడసంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళల కబడ్డీ

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధి ఇంజాపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి జిల్లా 68వ మహిళా అండర్–19 కబడ్డీ పోటీలు జరగనున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉపాధి' పనులు పకడ్బందీగా చేపట్టండి

జిల్లా అధికారి అంబుడ్స్ పర్సన్ సునీతామూర్తి



రిజిస్టర్లు పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఉపాధిహామీ జిల్లా అధికారి అంబుడ్స్ పర్సన్ సునీతామూర్తి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఉపాధి మస్టర్, పనుల ప్రణాళిక, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి చట్టం– సోషల్ ఆడిట్‌పై సమీక్ష నిర్వహించారు. 13వ విడత సోషల్ ఆడిట్‌లో ప్రస్తావించిన పలు అంశాలపై ఇచ్చిన వివరణలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం రికార్డులు ఉండాలని, ఉపాధి చట్టాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చంద్రధనలో నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ గౌతమ్ చరణ్, ఏపీఓ కృష్ణ, ఈసీ కృష్ణ, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో తప్పులుండొద్దు

- కులగణన సమాచారాన్ని పారదర్శకంగా నమోదు చేయండి
- కంప్యూటర్ ఆపరేటర్ల శిక్షణలో అధికారులు
- గడువులోగా కుటుంబ సర్వేపూర్తి చేస్తామంటూ వెల్లడి



యాచారం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధి 24 గ్రామాల్లో 15,808 కుటుంబాలకు గాను, 13,713 కుటుంబాల సర్వే చేసినట్లు పేర్కొన్నారు. గడువులోగా మిగతా ఇళ్ల సర్వే చేస్తామని వెల్లడించారు. 30 మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయిస్తున్నామని తెలిపారు. ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రోజుకు 25 ఫామ్స్..

తలకొండపల్లి: కుటుంబ సర్వేలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రం రైతు వేదికలో కంప్యూటర్ ఆపరేటర్లకు ఎంపీడీఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడారు. సమగ్ర సర్వేలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సేకరించిన కుటుంబాల వివరాలను పారదర్శకంగా కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. ఇందు కోసం 54 మందికి పైగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 25 ఫామ్స్ చెప్పున మొత్తం 1,350 పత్రాల వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగాలు

జేఎన్‌టీయూహెచ్ కెమిస్ట్రీ హెచ్‌ఓడీ రమాదేవి



కార్యక్రమంలో ప్రొఫెసర్ రమాదేవి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని జేఎన్‌టీయూహెచ్ కెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ బి.రమాదేవి అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధి గుంతపల్లి గ్రామంలో అవంతి విద్యాసంస్థలో బీ ఫార్మసీ, డీ ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమలోని భయాందోళనను తొలగించుకుని, ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. అప్పుడే మంచి ఉద్యోగాలను సొంతం చేసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధాత్రి హెల్త్‌కేర్ సెంటర్ ఫౌండర్, ఎండీ చంద్రశేఖర్, బ్రహ్మకుమారి కవిత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్వామిరావు, పీఆర్‌ఓ శ్రీనివాస్‌నాయుడు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబుల, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసతిగృహానికి నీటి సౌకర్యం

సాక్షి ఎఫెక్ట్..

మంచాల: నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు ఊరట కలిగింది. 'కనీస అవసరాలకు కష్టమే..' అనే శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి శుక్రవారం అధికారులు స్పందించారు. వసతిగృహాన్ని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లావణ్య సందర్శించారు. పరిస్థితిపై ఆరా తీశారు. నీటి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని వార్డెన్ భాషయ్యను ప్రశ్నించారు. వెంటనే చిన్నారులకు నీటి సదుపాయం కల్పించి, ఇబ్బందులు తొలగించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది కొత్తగా బోరు మోటారు తెచ్చి, నీటిని సరఫరాను పునరుద్ధరించారు. నీటి సమస్య తీరడంతో బాలలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



బోరు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ధాన్యం కొనుగోలులో అలసత్వం తగదు

- రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ ఆదిలక్ష్మి

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలులో అలసత్వం తగదని, రైతులు దిగుబడిని తెచ్చిన వెంటనే కాంటా వేయాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ ఆదిలక్ష్మి సూచించారు. కేంద్రం వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ కుసుమమాధురితో కలిసి తనిఖీ చేశారు. అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భూదేవి, నిఖిత, పీఏసీఎస్ సిబ్బంది మహేశ్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని వారు సందర్శించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. దవాఖానలో అవసరమైన వసతుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పరిక్షిత్ నరేందర్, డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి

'ఐక్యత' సేవలు వినియోగించుకోండి



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్ సూచించారు. పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ.. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డితో కలిసి శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. 20 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, కొండల్‌రెడ్డి, మల్లయ్య, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్, రఘు, యాదయ్య, శేఖర్, శ్రీను, మహేశ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల బలోపేతానికి కృషి

మండల విద్యాధికారి పాండు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పాండు

ఆమనగల్లు: విద్యార్థుల సంఖ్యను పెంచి, ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓ పాండు కోరారు. పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో శుక్రవారం మండల పరిధి పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో అన్ని రకాల రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు బోధన సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, పద్మ, మండల కో ఆర్డినేటర్ సాయికుమార్, సీఆర్‌పీలు షేక్ అహ్మద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా సంతోష్‌గౌడ్



అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందుటి సంతోష్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూనే, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. లీగల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌గౌడ్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతిగౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

చందనం కాదు దుర్గంధం

- చెరువును ఆవహించిన గుర్రపుడెక్క
- పేరుకుపోయిన అపరిశుభ్రత



గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో నిండిన చందన చెరువు

మీర్‌పేట: ఆహ్లాదం పంచాల్సిన చందన చెరువు ప్రస్తుతం దుర్గంధం పంచుతోంది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చెరువును గత ప్రభుత్వం అనేక నిధులు వెచ్చించి సుందరీకరణ చేసింది. పిల్లలకు ఆట వస్తువులు, పెద్దలు వ్యాయామం చేసేందుకు జిమ్ పరికరాలతో పాటు తదితర సౌకర్యాలు కల్పించడంతో ప్రాంత ప్రజలు, వాకర్స్‌ను ఆకట్టుకుంది. నిత్యం సేద తీరేలా చేసింది. కానీ.. కొంతకాలంగా చెరువు పరిరక్షణను సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో చెరువును మొత్తం గుర్రపుడెక్క ఆవహించింది. చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. నెలలు తరబడి పరిస్థితి ఇలాగే ఉండటంతో భరించలేకపోతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆట వస్తువుల అపహరణ

సుందరీకరణలో భాగంగా యువత, చిన్నారుల కోసం ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటి పరిస్థితి దయనీయంగా మారింది. జిమ్ పరికరాల పర్యవేక్షణ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు నాని పూర్తిగా పాడైపోయాయి. పార్కులోని పరికరాలు ధ్వంసం అయ్యాయి. కొన్ని చోరీకి గురయ్యాయి. ఇలాగే వదిలేస్తే చెరువు మురికి కూపంగా మారే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి చెరువులోని గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు, జిమ్ పరికరాలను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

సిబ్బందికి జీతాల్లేవ్

చెరువు సుందరీకరణ అనంతరం 8 మంది సిబ్బందిని నియమించారు. రోజు వారిగా వారు విధులు నిర్వహిస్తున్నారు. కానీ నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని సిబ్బంది వాపోతున్నారు. కాంట్రాక్టర్‌ను అడిగితే నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని పేర్కొంటున్నారు.

వైద్యుడి మృతి తీరని లోటు

ఇబ్రహీంపట్నం: తన ఆస్పత్రి(అనిరెడ్డి రామరక్ష) ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్యుడు అనిరెడ్డి సుజన్‌రెడ్డి మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆరోగ్య సమస్యలతో అనిరెడ్డి గురువారం రాత్రి మృతి చెందగా.. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి శుక్రవారం సంతాపం తెలిపారు.

రహదారికి మరమ్మతు చేయించండి

మంచాల: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే తిప్పాయిగూడ–ముకునూర్ రోడ్డును మరమ్మతు చేయించాలని సీపీఎం జిల్లా నాయకుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన రాచకొండ గుట్టలకు ఆనుకొని ఉన్న తిప్పాయిగూడ రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారిందన్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు. అదే విధంగా ఆరుట్ల మీదుగా చౌటుప్పల్ వెళ్లే ఆర్టీసీ బస్సును తిప్పాయిగూడ మీదుగా నడిపించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, సుధాకర్, ఐలయ్య, బాల కృష్ణ, ప్రశాంత్, కిష్టయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన గౌడ సంఘం నేత



కేటీఆర్‌తో అశోక్ గౌడ్

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గౌడ సంక్షేమ సంఘం తాలూకా కన్వీనర్ మొక్కరాల అశోక్ గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించిన డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ పెంటయ్య తదితరులు - అబ్దుల్లాపూర్‌మెట్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. సాగర్‌రోడ్డుపై అంబేడ్కర్ కూడలి వద్ద శుక్రవారం ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి వేగం, అజాగ్రత్త, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులకు షీటీం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వేధింపులకు గురైతే షీటీం నంబరు 8712662111 లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, గ్రీన్‌ఫార్మాసిటీ, మాడ్గుల్ సీఐలు సత్యనారాయణ, లిక్కి కృష్ణంరాజు, జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



టోర్నీ ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ స్రవంతి

రాష్ట్రస్థాయి పోటీలు షురూ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాపీఠ్‌లో రాష్ట్ర స్థాయి 3వ సబ్–జూనియర్, 2వ సబ్– జూనియర్ డ్రాప్ రోబాల్ ఛాంపియన్ షిప్ పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ టోర్నీలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనువాస్ రావు, రాష్ట్ర డ్రాప్ రోబాల్ అబ్జర్వ్ కమిటీ కార్యదర్శి అక్బర్ బాబా, నిర్వాహకులు రహమత్, అనూష, సురేందర్, చంద్రశేఖర్, రాము, ఆంజనేయులు, లింగస్వామి, సుధాకార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి

మంచాల: వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటన నేపథ్యంలో అరెస్టు చేసిన లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల భూములను లాక్కోవాలని చూడటం దారుణమన్నారు. సాగు చేసుకునే భూములను ఇవ్వమని రైతులు చెప్పినా.. వినిపించుకోకుండా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో అనుకోకుండా జరిగిన దాడిని సాకుగా చూపి, రాత్రి పూట ఇళ్లల్లోకి చొరబడి రైతులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు. బాధిత రైతులకు పార్టీ అండగా ఉంటుందని, వెంటనే వారిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, నాయకులు కిషన్‌రెడ్డి, వెంకటేశ్, జానీ పాష, రాజు, మల్లేశ్, శంకర్, ప్రశాంత్, రాజేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

కడ్తాల్: రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణం నిలబెట్టవచ్చని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తుప్పరి రాజు, సిద్దిగారి మహేశ్‌ల జ్ఞాపకార్థం వారి మిత్రబృందం శుక్రవారం అంజనీపుత్రా బ్లడ్ బ్యాంకు హైదరాబాద్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మృతుల ఫొటోలకు ఆయన నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడారు. ప్రపంచంలో స్నేహానికి మించిన ఆస్తి మరొకటి లేదని, స్నేహితుల గుర్తింపుగా వారి మిత్రులు శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాగా శిబిరంలో 65 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.